# మైనర్ బాలుడు అదృశ్యం



**దశ ఓయూ:** మల్లాపూర్‌కు చెందిన 14 ఏళ్ల బాలుడు అదృశ్యమైన ఘటనపై నాచారం పోలీసులు కేసు నమోదు చేశారు. నర్సింహానగర్‌కు చెందిన అనిల్‌కుమార్ కుమారుడు మనీష్‌కుమార్ (14) మల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. గత కొన్ని రోజులుగా పాఠశాలకు వెళ్లకపోవడంతో అక్టోబరు 4న తండ్రి మందలించినట్లు పోలీసులు తెలిపారు. అక్టోబరు 5న ఉదయం 8 గంటల సమయంలో పాఠశాలకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన మనీష్ సాయంత్రం 7.30 గంటలైనా ఇంటికి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితులు, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తండ్రి పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు మేరకు నాచారం పోలీసులు క్రైం నంబర్ 577/2026, బీఎన్ఎస్ 137(2) సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలుడి ఆచూకీ తెలిసిన వారు నాచారం పోలీసులకు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

# మన్నెక్రిశాంక్ అరెస్ట్

❖ *వివాదాస్పద బ్యానర్ల కేసులో బీఆర్ఎస్ నేత అదుపులోకి*



**దశ, హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుటుంబానికి సంబంధించి ఆరోపణలతో కూడిన బ్యానర్లు ఏర్పాటు చేసిన కేసులో బీఆర్ఎస్ నేత, సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్‌ను గోపాలపురం పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. సికింద్రాబాద్ మెడికవర్ ఆసుపత్రి వద్ద బ్యానర్లు ఏర్పాటు చేసిన వ్యవహారంపై ఈ కేసు నమోదైంది. ఆసుపత్రికి సంబంధించి రూ.13,200 కోట్ల ఆర్థిక లావాదేవీలు జరిగాయని క్రిశాంక్ ఆరోపించినట్లు పోలీసులు తెలిపారు. కాంగ్రెస్ నేత మెట్టు సాయికుమార్ ఫిర్యాదుతో క్రిశాంక్, 'ఎంఆర్ మీడియా తెలంగాణ' ప్రతినిధులపై బీఎన్ఎస్ సెక్షన్లు 353(2), 352 కింద కేసు నమోదైంది. క్రిశాంక్ తన ఆరోపణలను సమర్థిస్తూ ఈడీ విచారణ కోరగా, కేటీఆర్ ఆయన అరెస్టును ఖండించారు. మరోవైపు ఆరోపణలను ప్రభుత్వం తోసిపుచ్చింది. ముఖ్యమంత్రి కుటుంబానికి మెడికవర్‌తో ఎలాంటి వ్యాపార సంబంధాలు లేవని స్పష్టం చేసింది.

# కౌశిక్ రెడ్డిపై చర్యలకు అడుగులు



**దశ, హైదరాబాద్ :** బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ విచారణ తుది దశకు చేరింది. సభలో ఆయన వ్యవహారశైలి, వ్యాఖ్యలపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ ఆదేశాలతో కమిటీ విచారణ చేపట్టింది. తన వివరణకు ఆరు వారాల గడువు ఇవ్వాలని కౌశిక్ రెడ్డి కోరగా.. కమిటీ ఆ అభ్యర్థనను పూర్తిగా అంగీకరించకుండా ఈ నెల 11లోగా హాజరై లేదా రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. గడువు ముగిసిన అనంతరం ఈ నెల 13న కమిటీ సమావేశమై తదుపరి చర్యలపై చర్చించే అవకాశం ఉంది. కౌశిక్ రెడ్డి వివరణ ఆధారంగా కమిటీ నిర్ణయం తీసుకోనున్న నేపథ్యంలో ఈ వ్యవహారం రాజకీయంగా ఆసక్తికరంగా మారింది. అధికార పార్టీ నేతలు చర్యలకు పట్టుబడుతుండగా, కౌశిక్ రెడ్డి మాత్రం తనపై రాజకీయ కక్షసాధింపు జరుగుతోందని ఆరోపిస్తున్నారు.




**దశ,రంగారెడ్డి ప్రతినిధి**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో చోటుచేసుకున్న పరిణామాలు ఇప్పుడు జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. డీఎంహెచ్‌వోగా పనిచేసిన డాక్టర్ స్వర్ణకుమారి వ్యవహారశైలిపై కింది స్థాయి ఉద్యోగులు, సిబ్బందిలో కొంతకాలంగా అసంతృప్తి వ్యక్తమవుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు పలుమార్లు ఫిర్యాదులు,విన్నపాలు వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారం కొనసాగుతున్న సమయంలోనే ఏసీబీ చర్యలు చోటుచేసుకోవడంతో జిల్లా వైద్యశాఖలో ఒక్కసారిగా కలకలం రేగింది. సంబంధిత అధికారి ఏసీబీకి పట్టుబడిన ఘటనతో ఇప్పటివరకు కార్యాలయ పరిధిలో వినిపించిన ఆరోపణలు మరోసారి చర్చకు వచ్చాయి.

అసలు ఈ ఘటనకు దారితీసిన పరిస్థితులు ఏమిటి? గతంలో వచ్చిన ఫిర్యాదులు, ఆరోపణలకు తాజా ఏసీబీ చర్యకు ఏమైనా సంబంధం ఉందా? కార్యాలయంలో నిర్ణయాలు, అనుమతులు, తనిఖీలు, చర్యల విషయంలో ఎవరి పాత్ర ఎంత? అనే ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయి. అయితే ఈ అంశాలపై పూర్తి వాస్తవాలు అధికారిక దర్యాప్తులోనే తేలాల్సి ఉంది.

డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లకు సంబంధించిన అనుమతులు, తనిఖీలు, నిబంధనల అమలు, ఇతర అధికారిక ప్రక్రియల్లో కొందరు సీనియర్ ఉద్యోగులు కీలకంగా వ్యవహరిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనుమతులు, తనిఖీలు, నోటీసులు, సీజ్ చర్యలను ఆసరాగా చేసుకుని కొందరు నిర్వాహకులపై ఒత్తిడి తెచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. గత మూడు, నాలుగు నెలలుగా కొన్ని ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ కేంద్రాలపై తనిఖీలు,సీజ్ చర్యల పేరుతో ఒత్తిడి పెంచినట్లు నిర్వాహకులు వాపోతున్నట్లు సమాచారం. నిబంధనల ఉల్లంఘనలపై చర్యలు తీసుకుంటామన్న హెచ్చరికలతో పాటు భారీ మొత్తాల్లో డిమాండ్లు వచ్చినట్లు కొందరు ఆరోపిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి పూర్తి ఆధారాలు, వాస్తవాలు అధికారిక దర్యాప్తులో వెలుగులోకి రావాల్సి ఉంది.

ఒక అధికారి ఏసీబీకి పట్టుబడిన ఘటనతో వ్యవహారం ముగిసిపోవద్దన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కార్యాలయంలో ఏళ్లుగా కీలక స్థానాల్లో కొనసాగుతున్న కొందరు ఉద్యోగులు, అధికారులు తీసుకున్న నిర్ణయాలు, నిర్వహించిన తనిఖీలు, జారీ చేసిన నోటీసులు, చేపట్టిన సీజ్ చర్యలపై కూడా సమగ్రంగా పరిశీలన జరపాలని పలువురు కోరుతున్నారు. ఒకవైపు అనుమతులు, మరోవైపు తనిఖీలు.. ఆ తర్వాత నోటీసులు, సీజ్ చర్యలు.. ఈ మొత్తం ప్రక్రియలో ఎక్కడైనా అక్రమ వసూళ్లకు అవకాశం ఏర్పడిందా? ఎవరి ఆదేశాలతో చర్యలు జరిగాయి? వాటి వెనుక ఎవరెవరి ప్రమేయం ఉంది? అన్న అంశాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.


కార్యాలయంలో జరుగుతున్న పరిణామాలపై గతంలోనే కొందరు ఉద్యోగులు, సంబంధిత వర్గాలు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినట్లు సమాచారం. వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు కూడా పలుమార్లు విన్నపాలు వెళ్లినట్లు తెలుస్తోంది. అయితే ఆ ఫిర్యాదులపై ఏ స్థాయిలో విచారణ జరిగింది? ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అన్నది ఇప్పుడు ప్రశ్నగా మారింది. ఫిర్యాదులు వచ్చిన సమయంలోనే సమగ్రంగా విచారణ జరిగి ఉంటే తాజా పరిణామాలకు అడ్డుకట్ట పడేదా? లేక వ్యవహారం మరింత లోతుగా వెళ్లిందా? అన్న అంశాలపై కూడా స్పష్టత రావాల్సి ఉంది.

ఏసీబీ చర్యకు దారితీసిన ఘటనతో పాటు గత కొంతకాలంగా డీఎంహెచ్‌వో కార్యాలయంలో జరిగిన అనుమతులు, తనిఖీలు, నోటీసులు, సీజ్ చర్యలు, సంబంధిత ఫైళ్ల కదలికలు, అధికారిక నిర్ణయాలను పూర్తిస్థాయిలో పరిశీలించాలన్నడిమాండ్లు వినిపిస్తున్నాయి. అవసరమైతే సంబంధిత కాలానికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలు, ఫైళ్ల ప్రాసెసింగ్, అధికారిక రికార్డులను కూడా పరిశీలించాలని పలువురు కోరుతున్నారు.

ఏసీబీ చర్యతో ఒక ఘటన మాత్రమే వెలుగులోకి వచ్చిందా? లేక దీని వెనుక మరింత పెద్ద వ్యవస్థ ఉందా? అన్నది ఇప్పుడు కీలక ప్రశ్నగా మారింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రతి ఒక్కరి పాత్రపై నిష్పక్షపాతంగా విచారణ జరిపితేనే అసలు విషయం బయటపడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఫిర్యాదుల నుంచి ఏసీబీ దాకా సాగిన ఈ వ్యవహారంలో అసలు పాత్రధారులు ఎవరు? ఆరోపణలు ఎంతకాలంగా కొనసాగుతున్నాయి? అనుమతులు, తనిఖీలు, సీజ్ చర్యల పేరుతో ఎక్కడైనా అక్రమ వసూళ్లు జరిగాయా? ఒక్క అధికారి చర్యతో వ్యవహారం ముగుస్తుందా? లేక మొత్తం వ్యవస్థపై విచారణ జరుగుతుందా? అన్న ప్రశ్నలకు ఉన్నతస్థాయి సమగ్ర దర్యాప్తే సమాధానం చెప్పాల్సి ఉంది.

# హైద్రాబాద్‌లో వార్డు అధికారులకు పారిశుధ్యంపై శిక్షణ

**దశ ఓయూ:** పట్టణ పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణపై వార్డు అధికారుల సామర్థ్యాన్ని పెంపొందించేందుకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్‌సీయూఈఎస్‌లో ప్రారంభమైంది. సీడీఎంఏ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐయూఎం) సమన్వయంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో వివిధ పట్టణ స్థానిక సంస్థలకు చెందిన 42 మంది వార్డు అధికారులు పాల్గొన్నారు. మున్సిపల్ పరిపాలన శాఖ కార్యదర్శి డాక్టర్ టి.కె. శ్రీదేవి ఐఏఎస్ మార్గదర్శకత్వంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణలో ఘన వ్యర్థాల నిర్వహణ




నిబంధనలు-2026, స్వచ్ఛ భారత్ మిషన్-అర్బన్ 2.0, వ్యర్థాల విభజన, సేకరణ, మార్గ ప్రణాళిక, క్షేత్రస్థాయి పర్యవేక్షణ, మలబురద-సెప్టేజ్ నిర్వహణ, పారిశుధ్య కార్మికుల భద్రత తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. జీపీఎస్, ఎంఐఎస్, డ్యాష్‌బోర్డుల వంటి డిజిటల్ సాధనాల వినియోగంపైనా శిక్షణ ఇస్తున్నారు.

వార్డు స్థాయిలో పారిశుధ్య మెరుగుదల ప్రణాళికలను రూపొందించడం ఈ కార్యక్రమంలో ప్రత్యేకతగా నిలిచింది. శిక్షణలో నేర్చుకున్న అంశాలను తమ పరిధిలో అమలు చేసేందుకు వీలుగా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలోని 132 పట్టణ స్థానిక సంస్థల పరిధిలోని వార్డు అధికారులకు విడతల వారీగా శిక్షణ ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌సీయూఈఎస్ డైరెక్టర్ డాక్టర్ శ్రీ నాగేష్, సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్ కె. ఫల్గున్ కుమార్, ఎన్ఐయూఎం డైరెక్టర్ వి. వేణుగోపాల్ పాల్గొన్నారు.

# జేఎల్ క్రమబద్ధీకరణ ప్రక్రియ రద్దు చేయాలి

*ఓయూ జేఏసీ, తెలంగాణ నిరుద్యోగ జేఏసీ డిమాండ్*




**దశ ఓయూ:** కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్ల 2023 క్రమబద్ధీకరణ ప్రక్రియను రద్దు చేసి, కొత్త జూనియర్ లెక్చరర్ (జేఎల్) నోటిఫికేషన్ విడుదల చేయాలని ఓయూ జేఏసీ, తెలంగాణ నిరుద్యోగ జేఏసీ డిమాండ్ చేశాయి. ఈ ప్రక్రియలో అక్రమాలు, అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై సీబీఐ లేదా న్యాయమూర్తితో సమగ్ర విచారణ జరిపించాలని కోరాయి. ఈ మేరకు మంగళవారం ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి, నిరుద్యోగ సంఘాల నేతలు మాట్లాడుతూ.. నకిలీ ధ్రువపత్రాల ఆధారంగా క్రమబద్ధీకరణ పొందిన 35 మంది జూనియర్ లెక్చరర్లను ఇంటర్మీడియట్ బోర్డు సర్వీసు నుంచి తొలగించడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. అయితే కేవలం 35 మందితోనే చర్యలను పరిమితం చేయకుండా, నకిలీ ధ్రువపత్రాలతో లబ్ధి పొందిన వారందరిపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోటీ పరీక్షలు నిర్వహించకుండా గెజిటెడ్ స్థాయి పోస్టులను క్రమబద్ధీకరించడం వల్ల లక్షలాది మంది నిరుద్యోగులకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. క్రమబద్ధీకరణలో నకిలీ ధ్రువపత్రాల వినియోగంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన అధికారులపైనా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని మొత్తం క్రమబద్ధీకరణ ప్రక్రియను రద్దు చేసి కొత్త జేఎల్ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్‌చేశారు.

ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న పేద, గ్రామీణ, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే విషయంలో రాజీపడరాదన్నారు. అర్హత లేని వారిని కొనసాగించడం వల్ల విద్యార్థులకు నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. డిమాండ్లను పరిష్కరించకపోతే విద్యార్థి, నిరుద్యోగ ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్. నాగేశ్వరరావు, ఓయూ శంకర్, ఉదయ్, అజయ్, మహేష్, వేదాంత మౌర్య, కిరణ్, రంజిత్, మనోజ్, విష్ణు, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికులకు అభయ హస్తం కాంగ్రెస్: ప్రణవ్

**దశ, హుజురాబాద్:** కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని,ఐక్య కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఈ నెల 9 జరిగే ఆర్టీసీ ఎన్నికలకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఆర్టీసీ కార్మికులను దగా చేసి నానా విధాలుగా ఇబ్బంది పెట్టింది అన్నారు ప్రణవ్.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విశేషంగా కృషి చేస్తున్నారని,కార్మికులకు వారి కుటుంబాలకు అందే ఫలాలను అందజేస్తున్నారని, అలాగే కార్మికుల హక్కుల కోసం నిరంతరం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని వివరించారు.కార్మికులకు ప్రభుత్వానికి వారధిగా మంత్రి పొన్నం నిలుస్తున్నారని,విలీనం అంశం ప్రభుత్వం దృష్టిలో ఉందని,పదేళ్లుగా బిఆర్ఎస్ ప్రభుత్వం చేయలేని పనులను కాంగ్రెస్ ప్రభుత్వంలో చేసి చూపించమని ప్రణవ్ అన్నారు.ఈ ఎన్నికల్లో ప్రభుత్వానికి మద్దతుగా కార్మికులు నిలవాలని కోరారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని,కౌన్సిలర్లు,ఐక్య కూటమి నాయకులు,కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# మధురఫలం.. జాడ ఏదీ



- వర్షా భావం, పెరిగిన ఉష్ణోగ్రతలతో తగ్గిన దిగుబడి
- పూతలోనే దెబ్బ.. పిందెలు రాలిపోవడంతో కాయల కొరత
- 50–60 కాయలు రావాల్సిన చెట్టుకు పదిలోపే
- దిగుబడి తగ్గడంతో అమాంతం పెరిగిన ధరలు
- గ్రామీణులకు ఉపాధి దూరం.. మహిళా సంఘాలకూ దెబ్బ

**దశ, నిజామాబాద్**

ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గడం.. మరోవైపు పెరిగిన ఉష్ణోగ్రతలు.. సీతాఫలాల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. పూత దశలోనే ఇబ్బందులు మొదలై పిందెలు రాలిపోతుండటంతో చెట్లకు కాసిన కాయలు కూడా పూర్తిస్థాయిలో ఎదగడం లేదు. సాధారణంగా ఒక్కో చెట్టుకు 50 నుంచి 60 వరకు కాయలు ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం పదికి మించి కాయలు కనిపించడం లేదని రైతులు, సేకరణదారులు చెబుతున్నారు. దీంతో ఈ ఏడాది సీతాఫలాల లభ్యత గణనీయంగా తగ్గిపోయింది.

రాష్ట్రవ్యాప్తంగా సీతాఫలాల చెట్లు ఉన్నప్పటికీ ఉమ్మడి పాలమూరు జిల్లా వీటికి పెట్టింది పేరు. గుట్టలు, బంజరు భూములు, అటవీ ప్రాంతాల్లో సహజంగా సీతాఫలాలు విస్తారంగా పెరుగుతుండటంతో ప్రతి సీజన్‌లో పెద్ద ఎత్తున పండ్ల సేకరణ జరుగుతుంది. ఇక్కడి నుంచి హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు సీతాఫలాలను తరలిస్తారు. మహిళా సంఘాలు సైతం సీతాఫలాలను సేకరించి ప్రాసెసింగ్ చేసి కంపెనీలకు విక్రయిస్తూ ఆదాయం పొందుతుంటాయి. ప్రతి సీజన్‌లో సీతాఫలాల సేకరణ, ప్రాసెసింగ్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పలువురికి ఉపాధి లభిస్తుంది.

సీతాఫలం పంటలో పూత నుంచి పిందె, అక్కడి నుంచి కాయగా మారే దశ అత్యంత కీలకం. సాధారణంగా జూలై నుంచి ఆగస్టు మధ్య పూత పిందెగా మారి, సెప్టెంబర్ మొదటి వారానికి కాయలు పక్వానికి వస్తాయి. అయితే ఈ ఏడాది సకాలంలో వర్షాలు లేకపోవడం, అధిక ఉష్ణోగ్రతలు కొనసాగడంతో పూత, పిందె దశలోనే పంట దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. కొన్ని పిందెలు రాలిపోగా.. మరికొన్ని కాయలు ఎదగకుండానే చెట్లపైనే దెబ్బతిన్నాయి. తేమ, వర్షపాతం, ఉష్ణోగ్రతల్లో మార్పులు పండ్ల ఏర్పాటుపై ప్రభావం చూపడంతో దిగుబడి తగ్గిపోయింది.

ఇక సహజంగా పెరిగే సీతాఫలం చెట్ల సంఖ్య కూడా క్రమంగా తగ్గుతోంది. గుట్టల తొలగింపు, క్వారీలు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, భూముల వినియోగంలో మార్పులతో సీతాఫలం చెట్ల విస్తీర్ణం తగ్గిపోతోంది. దీంతో వాతావరణ పరిస్థితుల ప్రభావం మరింత తీవ్రంగా కనిపిస్తోంది. ఒకప్పుడు గుట్టల వద్ద, రోడ్ల పక్కన, గ్రామీణ ప్రాంతాల్లో విరివిగా కనిపించిన సీతాఫలం ఇప్పుడు అరుదుగా మారుతోంది.



దిగుబడి తగ్గడంతో మార్కెట్‌లో డిమాండ్ పెరిగి ధరలు అమాంతం పెరిగాయి. గతేడాది రూ.5 నుంచి రూ.7 వరకు లభించిన చిన్న సీతాఫలాలు, పెద్ద పండ్లు రూ.8 నుంచి రూ.10 వరకు విక్రయమయ్యాయి. గంపల లెక్కన రూ.200 నుంచి రూ.250 వరకు ధర పలికేది. ప్రస్తుతం హైదరాబాద్ వంటి పట్టణాల్లో నాణ్యత, బరువును బట్టి ఒక్కో సీతాఫలం రూ.30 నుంచి రూ.50 వరకు విక్రయిస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.

దిగుబడి తగ్గడం వల్ల పండ్ల ధరలు పెరగడమే కాకుండా ఈ సీజన్‌పై ఆధారపడే గ్రామీణ కుటుంబాల ఉపాధిపైనా ప్రభావం పడింది. సీతాఫలాలను సేకరించే వారికి ఆశించిన స్థాయిలో పండ్లు లభించకపోవడంతో ఆదాయం తగ్గిపోయింది. సేకరించిన పండ్లను ప్రాసెసింగ్ చేసే మహిళా సంఘాల పరిస్థితి కూడా అంతంతమాత్రంగానే ఉంది. గతేడాది ఇదే సమయానికి సీతాఫలాల ప్రాసెసింగ్ కార్యకలాపాలు సుమారు 60 శాతం వరకు కొనసాగగా.. ఈసారి ఇప్పటివరకు ఒక్క పండు కూడా అందలేదని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి.

వాతావరణ మార్పులు, వర్షాభావ పరిస్థితులు, సహజ సీతాఫలం చెట్ల విస్తీర్ణం తగ్గిపోవడం.. ఇలా రెండు వైపులా దెబ్బ తగలడంతో ఈ ఏడాది సీతాఫలాల జాడే కరువైంది. దిగుబడి తగ్గి ధరలు పెరగడంతో వినియోగదారులపై భారం పడుతుండగా.. మరోవైపు ఈ పంటపై ఆధారపడే గ్రామీణ ప్రజలకు ఉపాధి దూరమవుతోంది.

వచ్చే సీజన్‌లోనైనా వర్షాలు సమృద్ధిగా కురిసి, వాతావరణ పరిస్థితులు అనుకూలించి సీతాఫలాల దిగుబడి పుంజుకుంటుందా అన్నది చూడాల్సి ఉంది.

## కోదాడకు కోట్ల నిధుల వరద



**దశ, మునగాల:** భవిష్యత్తులో రాహుల్ గాంధీ దేశానికి ప్రధానమంత్రి కావడం ఖాయమని, రాష్ట్రంలో మళ్లీ ప్రజా ప్రభుత్వమే కొలువు తీరుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం ఎస్ఎంపేట రెవెన్యూ శివారులో సింగరేణి సంస్థ రూ. 9.60 కోట్ల నిధులతో నిర్మించనున్న భారీ కమ్యూనిటీ వంటశాల నిర్మాణానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిలతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిఅధ్యక్షతననిర్వహించినసభలోమంత్రిఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల ప్రజలను తమ సొంత కుటుంబ సభ్యుల్లా భావిస్తూ ఈ ప్రాంత అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. సభలో ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి మాట్లాడుతూ..తమ నియోజకవర్గానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, ఎస్పీ నరసింహ, ఆర్డీవో సూర్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపూరి తిరపమ్మ, మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## రైతులందరికీ 'ఫార్మర్ రిజిస్ట్రేషన్' మస్ట్!

*జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి.పుల్లయ్య*



**దశ, కామేపల్లి:** పట్టాదారు రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ ను తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య సూచించారు. మంగళవారం కామేపల్లి మండలం, బర్లగూడెం గ్రామంలో ఫర్టిలైజర్ షాపును ఆయన ఆకస్మికంగా సందర్శించి రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..క్లస్టర్ల పరిధిలోని రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ ను చేసుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకోని రైతులకు ప్రభుత్వం అందించే పలు సంక్షేమ పథకాల ప్రయోజనాలతో పాటు యూరియా బుకింగ్, పీఎం కిసాన్ యోజన వంటి సేవలు నిలిచిపోయే అవకాశం ఉందన్నారు. పంటల బీమా, పెట్టుబడి పథకాలు, వివిధ రాయితీలకు సంబంధించిన ప్రయోజనాలు కూడా పొందలేరని వివరించారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ కోసం రైతులు ఆధార్ కార్డు, పట్టా పాస్ బుక్ సిద్ధంగా ఉంచుకోవాలని, ఆధార్ తో మొబైల్ నెంబర్ ను లింక్ చేసుకోవాలని ఆయన తెలిపారు. అనంతరం సమీపంలోని మీసేవ కేంద్రాన్ని లేదా వ్యవసాయ విస్తారణ అధికారిని సంప్రదించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు.

## పేదల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

**దశ, మునగాల:** అభివృద్ధి, సంక్షేమమే ప్రజా ప్రభుత్వానికి రెండు కళ్లలాంటివని, విద్యార్థుల సంక్షేమం కోసం కోట్ల రూపాయల నిధులతో పౌష్టికాహారం అందించి వారి ఆకలి తీరుస్తున్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం నడిగూడెం, మునగాల మండల పరిధిలోని ఎస్ఎంపేట రెవెన్యూ శివారులో జాతీయ రహదారి వెంట సింగరేణి కాలరీస్ సంస్థ రూ. 9.60 కోట్ల నిధులతో, హరే రామకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించనున్న భారీ కమ్యూనిటీ వంటశాల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోదాడ శాసనసభ్యురాలు ఉత్తమ్ పద్మావతి రెడ్డి, హరే రామకృష్ణ ట్రస్ట్ తెలుగు రాష్ట్రాల చైర్మన్ సత్యదాస్ చంద్ర స్వామీజీ, తేజ్ దాస్ స్వామీజీలతో కలిసి పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులు ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ..ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాడు మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని గత పదేళ్ల పాలకులు ఆర్థికంగా దివాలా తీయించారని విమర్శించారు.

# ఎస్సీ రోస్టర్‌లో మార్పులు చేస్తే ఉద్యమమే

❖ *ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ.*



**దశ ఓయూ:** ఎస్సీ వర్గీకరణలో మాదిగలకు జనాభా ప్రాతిపదికన న్యాయమైన వాటా దక్కలేదని, రోస్టర్ పాయింట్లలో మార్పులు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తే తీవ్రంగా వ్యతిరేకిస్తామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ హెచ్చరించారు.

ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఎదుట మంగళవారం నిర్వహించిన ఎంఎస్ఎఫ్ ప్రతినిధుల జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్లను పెంచి, వర్గీకరణ ప్రకారం మాదిగలకు 14 శాతం వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. జనాభా లెక్కల అనంతరం ఎస్సీ రిజర్వేషన్లను పెంచుతామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. వర్గీకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాత రోస్టర్ సవరణ పేరుతో కొత్త వివాదాలకు తావివ్వడం సరికాదన్నారు. కుల వివక్ష నిర్మూలన, సామాజిక న్యాయం కోసం మాలలు సహా అన్ని సామాజిక వర్గాలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. విద్యారంగానికి 15 శాతం బడ్జెట్ కేటాయించాలని, సంక్షేమ హాస్టళ్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

విద్యారంగ సమస్యలపై వచ్చే మార్చిలో 'ఛలో హైదరాబాద్' కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, అగ్రవర్ణాల్లోని పేదలను కలుపుకొని సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతల నిర్మూలన కోసం భవిష్యత్తులో ఉద్యమాలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ నాయకులు, రెండు తెలుగు రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## గోశాల, వేద పాఠశాలకు స్థలం కేటాయించాలని వినతి

**దశ, బెల్లంపల్లి:** బెల్లంపల్లి పట్టణంలో బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం గాయత్రీ మాతా ఆలయంతో పాటు గౌశాల,యాగశాల,వేద పాఠశాల కొరకు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ కృష్ణ కు వినతి పత్రం సమర్పించిన బెల్లంపల్లి బ్రాహ్మణ సేవా సమితి సభ్యులు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బ్రాహ్మణ కుటుంబాలు ఏదైనా కార్యక్రమాలు చేయాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ, అందరితో పాటు తమ సంఘానికి కూడా ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తే బాగుంటుందని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై ఇది వరకు ఎమ్మెల్యే గడ్డం వినోద్ తో పాటు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ కు వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులు, అన్నీ రాజకీయ పార్టీల నాయకులు సానుకూలంగా స్పందించి తమ వంతుగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు విఎల్ఎస్ శ్రీనివాస్ రావు, కోశాధికారి జగన్మోహనాచారి,సలహాదారుడు రాంభట్ల హరీష్ శర్మ, ఇతర ఈసీ సభ్యులు పాల్గొన్నారు.



## ప్రజల మద్దతు లేకనే బీజేపీ పార్టీ ఓటు చోరీకి పాల్పడుతోంది..






❖ *వొడితల ప్రణవ్..*

**దశ, హుజురాబాద్:** ప్రజాస్వామ్యంలో ఓటు అనేది ప్రతి పౌరుడి హక్కు అని అలాంటి హక్కులను బీజేపీ పార్టీ,ప్రభుత్వం కాలరాస్తుందని దానికి వ్యతిరేకంగా ఓటు చోరీ అంశంపై ఏఐసిసి పిలుపు మేరకు ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఇందిరా చౌక్ నుండి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ,నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ ఓటు చోరీ పై సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలు,బీజేపీ పార్టీలకు అనుకూలంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని,ప్రజల మద్దతు లేకనే ఇలాంటి పనులకు బీజేపీ ప్రభుత్వం ఒడిగడుతుందని అన్నారు.తక్షణమే సీఈసీ జ్ఞానేష్ పై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో చొప్పదండి శాసన సభ్యుడు,జిల్లా అధ్యక్షుడు మేడిపల్లి సత్యం,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్,మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి,నగర అధ్యక్షుడు అంజన్ కుమార్,హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని,ఇండియా కూటమి నాయకులు,వామ పక్ష సీపీఐ,సిపిఎం భాగస్వామ్యులు,మహిళ నాయకురాళ్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.